# శ్మశాన వాటికకు రంగులద్దిన సత్యం

### హర్షం వ్యక్తం చేసిన దబ్బిరాజు పేట గ్రామస్తులు



వేపాడ,సెప్టెంబర్13(ప్రభ న్యూస్) :

ఆయన సంకల్పం అందరికీ ఆదర్శనీయం. మంచిలోను చెడు చూడడం, ఇష్టం ఉంటే చెడులోను మంచి చూసే నేటి సమాజంలో వాటిని తృణప్రాయంగా భావించి మంచి పని చేసేందుకు మరో ముందడుగు వేసిన టీడీపీ నేత కోన సత్యం తాజాగా గ్రామంలో అందరికీ ఉపయోగపడే స్మశానవాటికకు ఆకర్షణీయమైన రంగులు వేయించి సెహబాస్ అనిపించుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని దబ్బిరాజుపేటలో స్మశాన వాటిక విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయం అందరికీ స్ఫూర్తిదాయకమే. ఐదారు ఏళ్లలో మూడు సార్లు స్మశాన వాటికలో క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టిన వ్యక్తి టీడీపీ నేత కోన సత్యం. ఇటీవలే సొంత డబ్బులతో క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టిన ఆయన తాజాగా స్మశాన వాటికలోని ప్రహరీ గోడకు, అంత్యక్రియలు నిర్వహించే షెడ్డుకు, మృతుడు బంధువులు కొద్దిసేపు విశ్రాంతి తీసుకునే షెడ్డుకు సొంత ఖర్చులతో ఆకర్షణీయంగా రంగులు వేయించి మరో ముందడుగు వేసిన ఘనత ఆయనకే దక్కిందని చెప్పాలి. నిజానికి కోన సత్యం ధనవంతుడు కాకపోయినప్పటికీ సుమారు 8వేల రూపాయలకు పైగా ఖర్చు పెట్టి రంగులు వేయించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఎర్ర సూర్యునికి అశ్రునివాళి



శృంగవరపుకోట ,సెప్టెంబర్13(ప్రభ న్యూస్) :

ఎర్ర సూర్యుడు సీతారాం ఏచూరి కి మండల సిపిఎం పార్టీ సభ్యులు, సిఐటియు అనుబంధ సంఘ కార్మికులు, శుక్రవారం అశ్రు నివాళులను అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండలకార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ ఎర్ర సూర్యుడు అస్తమయం, కమ్యూనిస్టు ఉద్యమ యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి, కమ్యూనిజం నేల రాలిపోయిన ఎర్రమందారం కామ్రేడ్ సీతారాం ఏచూరి, మీ మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటు మీ ఆశయం ఎనలేనిది ఉద్యమమే ఊపిరిగా ఆసియా సాధన లక్ష్యంగా తుది శ్వాస వరకు పోరు సలిపిన కామ్రేడ్ సీతారాం ఏచూరి మీకు విప్లవ జోహార్లు సాధిస్తాం కామ్రేడ్ సీతారాం ఏచూరి గారి ఆశయాలను అంటూ నినాదాలు చేస్తూ శ్రద్ధాంజలి ఘటించారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండలశాఖ కార్యదర్శి చెలికాని ముత్యాలు, పార్టీ సభ్యులు కే రమేష్, జి సత్యనారాయణ, పి రాజు, ఎం శివ, జి దేవి, టి భారతి, ఎస్.కె హిమాం తదితరులు పాల్గొన్నారు.

# కార్నియాలను సేకరించిన రెడ్ క్రాస్



విజయనగరం అర్బన్, సెప్టెంబర్ 13 (ప్రభ న్యూస్):

నగరంలో ఉడా కాలనీ ఫేస్ -3 కి చెందిన యస్. రావూరావు మరణ సమాచారాన్ని తెలుసుకున్న ఆప్తలమిక్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు మృతుని కుటుంబసభ్యులకు నేత్రదానం గురించి వివరించి, అక్కడున్న వారికి నేత్ర దానం పై అవగాహన కల్పించి మృతుని కుటుంబ సభ్యుల అనుమతితో డి.బి.సి.యస్.విజయనగరం సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, విజయనగరం జిల్లా శాఖ రెండు కార్నియాలను సేకరించింది.ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ కె.ఆర్.డి ప్రసాదరావు,కార్యదర్శి కె. సత్యం అతని కుటుంబ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఐడొనేషన్ సెంటర్ ఆప్తాల్మాలిక్ టెక్నీషియన్ ఎ. రమణ, రెడ్ క్రాస్ సిబ్బంది వి.సత్య రామ్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తులో మునిగి తేలుతున్న యువత

### మద్యనిషేదంలో మాట తప్పిన గత ప్రభుత్వం
### అదే బాటలో ముందుకు సాగుతున్న టీడీపీ ప్రభుత్వం
### మద్యనిషేదం సరే బెల్టు షాపులైనా నివారించలేరా?

వేపాడ ,సెప్టెంబర్13(ప్రభ న్యూస్) :

రాష్ట్రంలోని యువత మత్తులో మునిగి తేలుతుందన్న సంగతి అందరికీ తెలిసిందే. అందుకు ప్రధాన కారణం పాలకుల దుర్బుద్ధి మాత్రమే అని చెప్పక తప్పదు. ఆ తర్వాత తప్పిదం తల్లిదండ్రులదే. ఇక గ్రామస్థాయి పాలకులు పెద్దలది కూడా ఎంతో కొంత పాత్ర ఉందని చెప్పవచ్చు. ఇలా చెప్పుకుంటూ పోతే గ్రామ స్థాయిలో మహిళా పోలీస్, సచివాలయం సిబ్బంది కూడా కారకులే. ఇంతమంది చేతులు కలిపి గ్రామాలకు మంచి చేస్తున్నారా అంటే లేదనే చెప్పాలి. నిజానికి మొట్ట మొదటి సారిగా గ్రామాల్లో బెల్టు షాపులు ప్రవేసి పెట్టి మద్యం ఏరులై పారించిన పాపం సిఎం చంద్రబాబు నాయుడుదేనని చెప్పక తప్పదు. బెల్టు షాపుల విధానం ప్రవేశపెట్టిన నాటి నుంచే గ్రామాల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో నూటికి పదిమంది మాత్రమే మద్యం సేవించేవారు. బెల్టు షాపులు ప్రవేశపెట్టిన తర్వాత నూటికి 90శాతం పైగా మద్యం సేవిస్తున్నారనడంలో ఎటువంటి సందేహం లేదు. ముఖ్యంగా యువత ఎంతలా దిగజారి పోయారంటే వేకువ జామునుంచి త్రాగే టీ మాదిరిగా మద్యం త్రాగుతున్నారంటే ఎంత మేరకు యువత భవిష్యత్తు నాశనమవుతుందో అందరికీ తెలిసినా కళ్లు నోరు మూసుకునే పరిస్థితి దాపురించిందనడంలో ఎటువంటి సందేహం లేదు. చంద్రబాబు చేసిన తప్పును సరిదిద్దుతాను, మహిళా మణుల కోరిక మేరకు ముందుగా బెల్టు షాపులు ఎత్తివేసి దశల వారీగా మద్యనిషేధం అమలు చేస్తానని నన్ను నమ్మి గెలిపించండి అని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ అధినేత వై ఎస్ జగన్మోహన్ రెడ్డి బెల్టు షాపులు ఎత్తివేయక పోగా మద్యం ధరలు మరింతగా పెంచడమే కాకుండా అధికారం కోల్పోయే వరకూ మద్య నిషేధం అమలు చేయలేక పోయి అధికారం కోల్పోయిన నేపథ్యంలో ఇకపై రాష్ట్రంలోని యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కనీసం బెల్టు షాపులనైనా సంపూర్ణంగా ఎత్తివేసే విధంగా కఠినమైన నిబంధనలు పాటింప జేసి ఏపీకి పూర్వపు రోజులను గుర్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెల్లవారు జాము, రాత్రి పగలు అన్న తేడా లేకుండా ఏపీ ప్రజలను త్రాగేలా చేస్తున్నపాలకులు సిగ్గుతో తలదించుకోవాలి. మత్తుకు బానిసలుగా మారిన యువత ప్రభుత్వ మద్యం దొరకనప్పుడు నాటు సారా, గంజాయి సేవించడం పరిపాటిగా మారింది. ఈ మత్తులో రోడ్డు ప్రమాదాలను కొనితెచ్చుకోవడం , ప్రాణాలు కోల్పోవడం లేదా క్షతగాత్రులు కావడం మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. అపురూపంగా కని పెంచుకునే పిల్లలు మత్తులో రోడ్డు ప్రమాదాలకు గురై మరణిస్తే వారి తల్లిదండ్రుల మనోవేదన వర్ణనాతీతం అని చెప్పక తప్పదు. అత్యదిక మెజారిటీతో గెలుపొందిన సీఎం చంద్రబాబు నాయుడు మత్తు నిర్మూలన కోసం ప్రత్యేక దృష్టిసారించాలి. పక్కాగా బెల్టు షాపులు ఎత్తివేసి పేదవాడికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి.భావితరాలకు దిక్సూచిగా నిలవగలగాలి. కేవలం మద్యం అమ్మకాలు ద్వారా వచ్చే ఆదాయం కోసం వెంపర్లాట మానుకోవాలి. ఓట్ల కోసం సీట్ల కోసం రాష్ట్రాన్ని అధోగతి పాలు కాకుండా మంచి సమాజ నిర్మాణానికి అవసరమైన నిధులను సేకరించి వాటిని ప్రజల కోసం ప్రగతి కోసం వినియోగించాలి. డబ్బుతోను మద్యంతోనూ ఓట్లు కొనే, అమ్ముడు పోయే పరిస్థితి రాకుండా రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిపేందుకు పాలకులు కృషి చేయాలి. యువత కూడా మంచి పాలన అందించే వారికి అండగా నిలవాలి.



# అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా ఆమోదం




దత్తిరాజేరు,సెప్టెంబర్13(ప్రభ న్యూస్) :

అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మండలంలో 35 గ్రామాలకు సంబంధించి ఉపాధి హామీ పథకం నిధులు నుంచి 3117 పనులకు 129 కోట్ల రూపాయలు అవసరమని గుర్తించడం జరిగిందన్నారు. ఎంపీపీతో పాటు ఎంపీటీసీ సభ్యులు అందరూ ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలు శ్రేయస్సు కోసం అభివృద్ధి పనులకు మద్దతు పలకడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఆలోచనలకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు. ఇటీవల గ్రామాలలో గ్రామ సభలో పెట్టి గ్రామాలలో అవసరమైన పనులను గుర్తించడం జరిగిందన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య సూచనలు మేరకు అభివృద్ధి పనులకు మద్దతు తెలియజేయడం జరిగిందన్నారు. తాము అభివృద్ధి పనులకు వ్యతిరేకం కాదని తనతో పాటు ఎంపీటీసీ సభ్యులందరూ మద్దతు తెలియజేయడం జరిగిందన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ 400 సిసి రోడ్లు, 310 సీసీ కాలవలు, 9 కాంపౌండ్ వాల్స్, 180 గొర్రెల షెడ్డులు, 406 ఫారం ఫండ్స్, 261 చానల్స్, 1019పశువులు కొట్టాలు, 335 చెరువులు, 46 గ్రావెల్ రోడ్లు తదితర పనుల మంజూరు కోసం ఆమోదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్,ఎంపీటీసీ సభ్యులు మంత్రి అప్పలనాయుడు, వంగపండు కృష్ణమూర్తి, నాగిరెడ్డి సత్యం పాల్గొన్నారు.

# ఉపాధి పనులపై ఎంపీపీ సమీక్ష



నెల్లిమర్ల, సెప్టెంబర్ 13(ప్రభ న్యూస్):మండలంలోని అన్ని పంచాయతీల్లో చేపట్టబోయే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సర్పంచ్ లు, ఎంపీటీసీ సభ్యులతో ఎంపీపీ అంబల్ల సుధారాణి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాబోయే మూడేళ్ళలో గ్రామాల్లో చేపట్టబోయే ఉపాధి పనులపై తీర్మానం చేస్తున్నట్లు చెప్పారు. సదరు తీర్మానాన్ని జిల్లా కలెక్టర్ కు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సౌత్ సెంట్రల్ రైల్వే సలహా మండలి సభ్యులు అంబల్ల శ్రీరాములనాయుడు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం పాల్గొన్నారు.


## శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : 501, సల్కాన్ అరుం, జసోలా జిల్లా సెంటర్, కొత్తఢిల్లీ - 110025
సిఐఎన్ : యు65900డిఎల్2020పిఎల్సి366027

**వేలం ప్రకటన**

శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క దిగువ తెల్పిన రుణగ్రహీతలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంక్ వారి నుండి వారిచే పొందిన బంగారంపై రుణం/లు బ్యాంకు వారిచే జారీచేయబడిన వ్యక్తిగత నోటీసులతో సహా వివిధ డిమాండ్లు మరియు నోటీసులు ఇచ్చినప్పటికీ వారిచే సర్దుబాటు చేయబడ లేదు రుణగ్రహీతలందరికీ ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంకు వారితో సెక్యూరిటీగా ఉంచిన బంగారు ఆభరణాలు వేలం వేయుటకు నిర్ణయించబడినది మరియు రుణాలుపొందిన శాఖ ఆవరణలలో తదనుగుణంగా 25.09.2024న మ॥03.00గం॥లకు వేలం తేదీగా నిర్ణయించబడినది. రుణగ్రహీత లతో సహా అందరు ఖాతాదారులు మరియు యావన్మంది ప్రజలు వేలం యొక్క నియమనిబంధనల ప్రకారం ఈ వేలంలో పాల్గొనగలరు.

| శాఖ | ఖాతా నెం. | ఖాతాదారుని పేరు | తండ్రి/ భర్త లేదా భార్య పేరు | చిరునామా | ఖాతా తెరచిన తేది | చెల్లించవలసిన మొత్తం |
|---|---|---|---|---|---|---|
| జూబ్లీహిల్స్ | 103942511429 | పాలూరు జగదీశ్వరి | తండ్రి ఆదినారాయణ | ఇంటి నెం.4-41, బిసి కాలనీ, బలిజిపేట, బార్లీ గ్రామం, విజయనగరం, ఆంధ్రప్రదేశ్ -535557 | 09/05/2024 | 210708.69 |

**వేలం తేది : 25.09.2024న మ॥03.00గం॥లకు**

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం నుండి ఏదేని ఖాతాను తొలగించుట లేదా రద్దు చేయుటకు బ్యాంకు వారు హక్కు కలిగి ఉన్నారు.

సం/- అధీకృత అధికారి, శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్